బాపూ బాట.. ఆరోగ్య మూట



గాంధీ జయంతి నేడు

న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్

మహాత్మా గాంధీ.. బతికింది 79 ఏళ్లు.. చనిపోయి 76 ఏళ్లయినా ఆయన చూపిన బాట అనుసరణీయం. బాపూజీ ఆలోచనలు ఆధునిక సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం ఆరోగ్యకర జీవనశైలిని అనుసరించాలని పరిశోధనలు చేసి చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు ఇప్పుడు చెబుతున్నవన్నీ అలనాడు గాంధీజీ తన నిత్య జీవితంలో ఆచరణలో చూపించారు. అందుకే మానసికం, శారీరకంగా దృఢంగా ఉండి.. జాతికి విముక్తి కల్పించే దీక్షలో విజయవంతమయ్యారు. ప్రస్తుతం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఆయన జీవన విధానాన్ని అనుసరిస్తే దృఢంగా తయారవుతాం. ఉమ్మడి జిల్లా ప్రజల కోసం ఆయన అభిరుచులు, అలవాట్లపై 'న్యూస్‌టుడే' కథనం.

ధ్యానం, వ్యాయామం



బాపూ ఉదయం, సాయంత్రం వేళల్లో ధ్యానం చేస్తుండేవారని చెబుతారు. ధ్యానంతోనే సత్యాగ్రహంతో అహింసా విధానానికి కట్టుబడి ఉన్నారు. సైబర్ యుగంలో ఎదుర్కొంటున్న ఒత్తిడిని అధిగమించడానికి ధ్యానం, వ్యాయామం ప్రతి ఒక్కరికీ అవసరమే.

వ్యసనాలకు దూరం



గాంధీ టీ, కాఫీ వంటి వాటికి బదులుగా తేనె, వేడి నీటిని ఎంచుకున్నారు. ప్రాణాంతక వ్యాధులకు కారణమైన మద్యం, పొగాకుకు దూరంగా ఉండాలని ప్రబోధించారు. ఇప్పుడు టీ, కాఫీ, శీతల పానీయాల విషయంలో వేడినీరు, నిమ్మరసం తాగడం అలవాటు చేసుకుంటే శరీరానికి మేలు.

రోజూవారీ నడక



మహాత్ముడు 40 ఏళ్లు దాదాపు రోజుకు 18 కి.మీ నడిచిన సందర్భాలున్నాయి. అలా 79వేల కి.మీ నడిచారని చెబుతారు. ఆయన దృఢంగా ఉండటానికి కారణం నడకే. కారణలేమైనా 52 శాతం మంది భారతీయులు నడక, వ్యాయామానికి దూరంగా ఉంటున్నారని ఇటీవల ఒక సర్వే పేర్కొంది. ప్రతి వ్యక్తి రోజుకు అరగంట నడిస్తే ఆరోగ్యానికి మేలని నిపుణులు చెబుతున్నారు.

క్రమమైన నిద్ర



శరీరానికి తగినంత విశ్రాంతి ఇవ్వాలని ఆరు గంటలు నిద్రపోయేవారట. ప్రస్తుతం నిద్రలేమి సమస్య సాధారణమైంది. నిద్రకు సమయపాలన లేకుండా పోయింది. సమతుల్యం లోపించి అనారోగ్యాలు వెంటాడుతున్నాయి. క్రమమైన నిద్ర అలవరచుకోవాలి.

ఆరోగ్యానికి ఉపవాసం



ఆరోగ్యం కోసం ఉపవాసం ఆచరించేవారని చెబుతారు. ఈ దీక్షలే బ్రిటీషర్లపై నిరసనకు ఆయుధంగా వినియోగించారు. కొవ్వులు తగ్గించి, పేగుల కదలికలు క్రమబద్ధీకరించడం, జీవనశైలి వ్యాధులు నియంత్రణకు దోహదం చేసే ఉపవాసం అనుసరిస్తే మేలు.

సానుకూల దృక్పథం




గాంధీజీ మనసును సానుకూలంగా ఆలోచించేలా తీర్చిదిద్దాలని విశ్వసించారు. ప్రశాంతమైన మనసు ఎలాంటి పరిస్థితి, సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సాయపడటంతో పాటే అనారోగ్య పరిస్థితులు దూరం చేస్తుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సానుకూల దృక్పథమే ఒక నైపుణ్యంగా మారింది. దాన్ని అలవరచుకోవాలి.

ప్రకృతిని ప్రేమించడం



ప్రకృతి ప్రతి ఒక్కరి అవసరాలు తీర్చడానికి సరిపోతుంది. కానీ ఎవరి దురాశను తీర్చడానికి కాదని చెప్పేవారు. ఈ అభిప్రాయం నేటి తరానికీ అవసరమే. దురాశతో చెట్లు నరకడం, జలవనరులు ఆక్రమించడం, ఇసుక, గుట్టలు కొల్లగొట్టడంతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుంది.

చదవడం, రాయడం



మహాత్ముడు వివిధ పుస్తకాలు, దినపత్రికలు చదివేవారు. చదవడంతోనే మానసిక స్థితి మెరుగుపరచుకున్నారని చెబుతారు. రాయడంలోనూ దిట్ట. పుస్తకాలు, లేఖలు, పత్రికలకు వ్యాసాలు రాశారు. ప్రస్తుత తరం పిల్లల్లో తగ్గిపోయిన పఠనాసక్తి ప్రమాదకరమని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. పిల్లల చేత పుస్తకాలు చదివించడంతో పాటు రాయడం సాధన చేయించాలని సూచిస్తున్నారు.

సేవాభావం

పేదలకు సేవ చేయాలనే తపన ఆయనకు ఉండేది. సేవా దృక్పథం అలవరచడానికి కృషి చేశారని చెబుతారు. మన పనులు మనమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములవ్వాలి.

ఆహారపు అలవాట్లు



గాంధీజీ తాజా కూరగాయలు, ఫలాలు, చిరుధాన్యాలు, పరిమిత నూనె, ఉప్పు, మసాల దినుసులు, శాకాహారానికి ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుతం సమతుల ఆహారానికి విరుద్ధమైన ఆహారం తీసుకుంటున్నాం. ఫలితంగా జీవన శైలి వ్యాధులు సంభవిస్తున్నాయి. అందుకే మహాత్ముడి ఆహారపు అలవాట్లను అనుసరించాలి.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 రెండు జిల్లాలకు సంబంధించి పలు విషయాలు వెల్లడించింది. దీని ఆధారంగా ఆయా జీవనశైలి వ్యాధుల సమస్యలు ఇలా ఉన్నాయి. (శాతాల్లో)

★ నిజామాబాద్
● కామారెడ్డి

15 ఏళ్లు పైబడిన వారిలో పొగాకు అలవాటు
మహిళలు ★ 8.6 ● 5.6
పురుషులు ★ 20.6 ● 25.7

15 ఏళ్లు పైబడిన వారిలో మద్యం అలవాటు
మహిళలు : ★ 9.8 ● 16.7
పురుషులు ★ 40.2 ● 41.8

	★	●
15-49 ఏళ్ల మధ్య వయస్కుల్లో రక్తహీనత	57.0	58.9
ఈ వయస్కుల్లో బాడీమాస్ ఇండెక్స్ సాధారణం ఉన్నవారు	21.0	21.7
అధిక బరువున్నవారు	27.5	21.0
రక్తపోటు మహిళల్లో	27.1	27.7
రక్తపోటు పురుషుల్లో	31.2	29.1
మధుమేహం మహిళల్లో	13.5	12.9
మధుమేహం పురుషుల్లో	15.6	17.5

తల్లిదండ్రుల బాగోగులపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్

కామారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల బాగోగులపై పిల్లలు శ్రద్ధ చూపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం చైతన్య కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో దాదాపు 40 శాతం వృద్ధులు ఉన్నారన్నారు. ఎంతో మంది పిల్లలు తల్లిదండ్రులను వృద్ధాశ్రమానికి పంపుతున్నారన్నారు. ఇది చాలా బాధాకరమన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకుంటే తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం దొరుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్, సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దసరాకు 482 ప్రత్యేక బస్సులు

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని 482 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం జానిరెడ్డి తెలిపారు. నిజామాబాద్ నుంచి జేబీఎస్‌కు, జేబీఎస్ నుంచి నిజామాబాద్‌కు ప్రతి 15 నిమిషాలకు ఒక సర్వీసు నడిపేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు నడుస్తాయన్నారు. రీజియన్‌లోని నిజామాబాద్- 1, 2, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ, కామారెడ్డి డిపోల నుంచి జేబీఎస్‌కు నడుపుతున్నట్లు తెలిపారు. దూరప్రాంతాలకు వెళ్లేవారు www.tsrtconline.in వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. ఇబ్బందులుంటే ఫోన్ చేయాలని సూచించారు.



- ఆర్మూర్ – 73828 43133
- బోధన్ – 98495 00725
- నిజామాబాద్– 99592 26022
- బాన్సువాడ– 94911 05706
- కామారెడ్డి – 84682 20281

పల్లె పాలనకు నిధులు

రాగిజావ.. విద్యార్థికి చేవ.. 8లో

'భాజపాతోనే సుపరిపాలన సాధ్యం'

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: భాజపాతోనే సుపరిపాలన సాధ్యమని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. కామారెడ్డి ఆర్టీసీ ప్రాంగణంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు చౌరస్తా, జేపీఎన్ రోడ్డులో పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించారు. రాజారెడ్డి గార్డెన్స్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా 20 కోట్ల సభ్యత్వాలు నమోదయ్యేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రధాని మోదీ శక్తివంతమైన నాయకుడన్నారు. ఆయన ఉన్న పార్టీలో అదే స్థాయిలో సభ్యత్వాలు చేయాలని లక్ష్యం నిర్దేశించామన్నారు. ఇప్పటికే ఏడు కోట్లు పూర్తయ్యాయన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే స్థాయి నాయకులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పదేళ్లు పాలించిన భారాస, మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు హామీల అమల్లో నిర్లక్ష్యం చేశాయని ఎద్దేవా చేశారు. ప్రతి బూత్ పరిధిలో గత పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కన్నా ఎక్కువ సభ్యత్వాలు చేయాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీ బీబీపాటిల్, మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు, నేతలు మురళీధర్‌గౌడ్, ఆలె భాస్కర్, నీలం చిన్నరాజులు, రణజిత్ మోహన్, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, రవీందర్‌రావు, నరేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మోటూరి శ్రీకాంత్, విపుల్, ఆకుల భరత్ పాల్గొన్నారు.





కామారెడ్డిలో సభావేదికపై నుంచి నమస్కరిస్తున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, చిత్రంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, జిల్లా అధ్యక్షురాలు అరుణతార : కార్యకర్తకు సభ్యత్వం అందజేస్తూ...

బతుకమ్మకు వేళాయె

నేటి నుంచి వేడుకలు

న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

ఆడపడుచుల ఆత్మీయ వేడుక బతుకమ్మ. తీరొక్క పూలతో శిఖరంలా పేర్చి ఆడిపాడుతారు. ఈ సంబురం కోసం ఏడాదంతా ఎదురుచూస్తారు. అలాంటి ఉత్సవం రానే వచ్చింది. బుధవారం నుంచి బతుకమ్మ మొదలు కానుంది. తొమ్మిది రోజుల పాటు ఉత్సాహంగా చేసుకుంటారు.

రోజుకో పేరుతో..

వినాయక చవితి నిమజ్జనం తర్వాత రోజు నుంచి చిన్నారులు బొడ్డెమ్మ ఆడతారు. తర్వాత పితృ అమావాస్య నాడు పేర్చే ఎంగిలి పూల బతుకమ్మతో అసలు సంబరాలు మొదలవుతాయి. తొమ్మిది రోజుల పాటు రోజుకొక పేరుతో పేరుస్తారు. మొదటి రోజు ఎంగిలిపూల, రెండో రోజు అటుకుల, మూడో రోజు ముద్దపప్పు, నాలుగో రోజు నాన బియ్యం, ఐదో రోజున అట్ల, ఆరోరోజు అలిగిన, ఏడో రోజు వేపకాయల, ఎనిమిదో నాడు వెన్నముద్దల, తొమ్మిదోనాడు సద్దుల బతుకమ్మగా కొలుస్తారు. ఇందులో పూలదే కీలకపాత్ర. గునుగ, తంగేడు, గన్నేరు, పోక బంతి, బీర, గుమ్మడి, బంతి, చామంతి, తామర తదితర పూలు ఉపయోగిస్తారు. పైన తమలపాకులో పసుపుముద్దను గౌరమ్మగా ఉంచి మంగళహారతులు సమర్పిస్తారు. ఒక్కోపువ్వునకు ఒక్కో విశిష్టత ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, ఆరోగ్యం, సిరిసంపదలు సమకూరుతాయని నమ్ముతారు. ప్రధాన పట్టణాలైన కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డితో పాటు మండలాలు, గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు మహిళలు సిద్ధమయ్యారు.

పాటల్లో అనుబంధాలు

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు, కుటుంబ సభ్యుల మధ్య ప్రేమలు, ఆప్యాయతలను గుర్తుచేస్తూ ఆడపడుచులు వలయాకారంగా తిరుగుతూ పాటలు పాడుతూ ఆటలు ఆడుతారు. గారెలు, అప్పాలు, వడలు, అట్లు, పూరీలు, అటుకులు, పులిహోరా, పెరుగన్నం నైవేద్యంగా తయారుచేస్తారు. చివరగా.. సమీప చెరువులు, కుంటలు, వాగులు, నదుల్లో పోయి రావమ్మా బతుకమ్మ.. మళ్లొచ్చే ఏడాది మళ్లీ రావమ్మా! అంటూ వీడ్కోలు పలుకుతారు. వెంట తెచ్చుకున్న సద్దులు ఆత్మీయంగా ఆరగిస్తారు.



పిట్లంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయినులు

మొరం తరలించొద్దు

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా మొరం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ అన్నారు. స్థానిక మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేటలో కొందరు అక్రమార్కులు మొరం తరలిస్తున్నారని గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం వెళ్లి పరిశీలించారు. వెంట కమిషనర్ శ్రీహరిరాజు ఉన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్

అభ్యర్థులకు పిలుపు

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

కామారెడ్డి విద్యావిభాగం-న్యూస్‌టుడే : ఉపాధ్యాయ పోస్టులకు 1:3 నిష్పత్తిలో ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితా మంగళవారం రాత్రి వరకు జిల్లాకు వచ్చాయి. అభ్యర్థుల చరవాణికి లేదా మెయిల్‌కు సంక్షిప్త సందేశాలు వచ్చినవారు విద్యాశాఖ కార్యాలయానికి నేటి నుంచి రావాలని డీఈవో రాజు సూచించారు. ఈ నెల 5వ తేదీ వరకు ప్రక్రియ కొనసాగనుంది. రెండు జతల నకలు పత్రాలు, ఆన్‌లైన్‌లో విచారణ దరఖాస్తును డౌన్‌లోడ్ చేసి వివరాలు నింపాల్సి ఉంది. కలెక్టరేట్ కార్యాలయంలోని 223 గదిలో అందుకు తగిన వసతులను కల్పించేందుకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. సూచించిన ధ్రువపత్రాల ఆధారంగా అన్ని వివరాలు సంసిద్ధం చేసుకోవాలని అధికారులు సూచించారు. కాగా మంగళవారం నుంచే ధ్రువపత్రాలు పరిశీలించాల్సి ఉన్నా జాబితాలు జిల్లాకు రాలేదు. దీంతో అభ్యర్థులు అయోమయానికి గురయ్యారు.


కామారెడ్డి కోర్టు ఆవరణలో చెత్త తొలగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్

స్వచ్ఛతతో ఆరోగ్యం

కామారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: కామారెడ్డి కోర్టు ఆవరణలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం జరిగింది. జిల్లా ప్రధానన్యాయమూర్తి వరప్రసాద్ స్వయంగా చెత్త తొలగించారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస‌నాయక్, సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్ తదితరులున్నారు.

కామారెడ్డిలోని 14వ వార్డులో..

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని పుర ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. జిల్లాకేంద్రంలో మంగళవారం 14వ వార్డులో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పలు విద్యాలయాల పిల్లలకు స్వచ్ఛతపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కమిషనర్ సుజాత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్, సిబ్బంది మోమిన్ తదితరులున్నారు.


పరిసరాలు శుభ్రం చేస్తున్న పుర ఛైర్‌పర్సన్ ఇందుప్రియ

ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి టీఎస్పీ భార్గవి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణమూర్తి, న్యాయవాదులు ఖలీల్, భూషణ్, రమాకాంత్‌రావు, రాంరెడ్డి, మొగులయ్య, సయ్యద్ హమీద్ తదితరులున్నారు.


స్వచ్ఛత పనులు చేపడుతున్న జూనియర్ సివిల్ జడ్జి, న్యాయవాదులు

కార్మికులకు వైద్యశిబిరం

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: కార్మికుల సేవలు ఎనలేనివని బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్ పేర్కొన్నారు. పట్టణంలోని కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎజాజ్, హకీం, కిరణ్, శ్రీనివాస్, బాబా, వెంకట్, శ్రీనివాస్, ఉదయ్, సతీష్, హన్మాండ్లు తదితరులున్నారు.

మొక్కలు నాటిన బ్యాంకు అధికారులు

బాన్సువాడ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సహకారశాఖ ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్ దివస్‌లో భాగంగా బాన్సువాడ సహకార బ్యాంక్ అధికారులు మంగళవారం మొక్కలు నాటారు. బ్యాంక్ మేనేజర్ సంజీవ్‌గౌడ్ మొక్కలు నాటి అందరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది రాజేశ్వర్, అంజయ్య తదితరులున్నారు.


బాన్సువాడ సహకార బ్యాంకు ఎదుట మొక్క నాటుతున్న అధికారులు

సర్వేలు, పథకాలపై దిశానిర్దేశం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన వీసీలో జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. కుటుంబ డిజిటల్ సర్వే, పట్టణ అభివృద్ధి అథారిటీ విస్తరణ, ఎల్ఆర్ఎస్ పూర్తిచేయడం, ధాన్యం కొనుగోళ్లు వంటి అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో ప్రభాకర్, డీపీవో శ్రీనివాస్‌రావు, మున్సిపల్ కమిషనర్ సుజాత పాల్గొన్నారు.


వీసీలో సూచనలు వింటున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్


జిల్లా జట్టుతో నిర్వాహకులు

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అండర్-14 బాలుర జట్టును నిర్వాహకులు మంగళవారం ఎంపిక చేశారు. గ్రామీణ మండలం సారంగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపికలు నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి వందమంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పీడీ రంగు కృష్ణంరాజు పేర్కొన్నారు. డిసెంబరు 6వ తేదీన గద్వాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టు పాల్గొంటుందని వెల్లడించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, పీడీలు శ్రీధర్, నాగరాజు, విజేష్ ఉన్నారు.

పల్లె పాలనకు నిధులు

జిల్లాకు రూ.6.53 కోట్లు విడుదల

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

కొన్నాళ్లుగా నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలకు సర్కారు తీపి కబురు అందించింది. జిల్లాకు స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ ద్వారా రూ.6,53,68,802 నిధులు విడుదల చేసింది. వీటిని ఎస్ఎఫ్‌సీ ఖాతాల్లో జమ చేసింది. ట్రాక్టర్ నెలవారీ వాయిదాలు, మల్టీపర్పస్ కార్మికుల వేతనాలు, విద్యుత్తు బిల్లులు, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలకు వెచ్చించాలని సూచించింది. ప్రభుత్వ నిర్ణయంతో పల్లెపాలన తిరిగి కొంతవరకు గాడిలో పడే అవకాశం ఉంది.


రామేశ్వర్‌పల్లి గ్రామం

పల్లెల శుభ్రతకు..

ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనానికి ప్రాధాన్యమిస్తోంది. ఈ కార్యక్రమానికి రూ.2,76,49,076 కేటాయించింది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం, మొక్కలు నాటించడం వంటి పనులు చేపడుతున్నారు. రోడ్లను శుభ్రం చేయించడం, పిచ్చిమొక్కలు తొలగించడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయించే పనులు పల్లెల్లో చేపడుతున్నారు. క్లోరినేషన్, పైపులైన్లు పగిలితే మరమ్మతులు చేయిస్తున్నారు. పల్లెల్లో పేరుకుపోతున్న తడి, పొడి చెత్తను నిత్యం సేకరించి కంపోస్టు యూనిట్లకు తరలిస్తున్నారు. ఈ విధమైన పనులు నిత్యం నిర్వహించడానికి డబ్బులు అవసరం. అందుకే స్వచ్ఛదనం- పచ్చదనానికి ప్రత్యేకంగా నిధులు(పది శాతం) కేటాయించారు.

జిల్లాలో పంచాయతీలు	:	526
మల్టీపర్పస్ కార్మికులు	:	1982
విడుదలైన మొత్తం నిధులు	:	రూ. 6,53,68,802
ట్రాక్టర్ కిస్తులు చెల్లించడానికి	:	రూ. 19,73,431
మల్టీపర్పస్ కార్మికుల వేతనాలకు	:	రూ. 1,99,52,295
స్వచ్ఛదనం- పచ్చదనం పనులకు	:	రూ. 2,76,49,076

కార్యదర్శులకు ఉపశమనం

ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో పాటు వేటికి ఖర్చు చేయాలో స్పష్టం చేయడంతో పంచాయతీ కార్యదర్శులకు కొంత భారం తగ్గినట్లయింది. మల్టీపర్పస్ కార్మికుల్లో కొందరికి రెండునెలలు, మరికొందరికి నాలుగు నెలల వేతనాల బకాయిలు చెల్లించాల్సి ఉంది. అసలే పండగ సమయం కావడంతో వీరి కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో ప్రత్యేకంగా కార్మికుల చెల్లింపుల కోసం నిధులు మంజూరు చేసింది. ప్రత్యేకాధికారులు వారి వారీ ఖాతాల్లో జమచేస్తే సరిపోతుంది.


నీటి ట్యాంకు చుట్టూ పేరుకుపోయిన పాకురు

పాకురు పట్టించుకోరూ...!

ఈ చిత్రంలో కనిపిస్తోంది మద్దెల్ చెరువులో ప్రధాన రహదారి పక్కన ఉన్న నీటి ట్యాంకు. చుట్టూ పాకురు పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. ఇక్కడికి నీటి కోసం వచ్చే స్థానికులు పాకురుతో జారి పడే ఆస్కారం ఉందని వాపోతున్నారు. ట్యాంకు పైభాగం నుంచి కింది వరకు అంతా పాకురుతో నిండింది. సంబంధిత అధికారులు తక్షణమే సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పిట్లం**

రాగిజావ.. విద్యార్థికి చేవ

● అంగన్‌వాడీల్లో పంపిణీకి ఏర్పాట్లు

న్యూస్‌టుడే, ఖలీల్‌వాడి(నిజామాబాద్)

అంగన్‌వాడీల్లో రాగిజావ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే అన్నపూర్ణ ట్రస్టు ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. కేంద్రాల్లో పోషకాహారం అందిస్తున్నా దానికి తోడుగా ఇవ్వడం ద్వారా పిల్లల్లో ఎదుగుదల మెరుగుపడుతుందని భావిస్తోంది. జిల్లాలో నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ ప్రాజెక్టుల పరిధిలో 1,500 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 3 నుంచి ఆరేళ్ల వయసున్న చిన్నారులు 54,170 మంది, గర్భిణులు 12,670, బాలింతలు 8,205 నమోదై ఉన్నారు. చిన్నారులు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు కావాల్సిన పోషకాలు ఇందులో ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు.



ఒకపూట సంపూర్ణ భోజనంలోని పదార్థాలు

బాలింతలు, గర్భిణులు	
బియ్యం	150గ్రాములు
కందిపప్పు	30 గ్రాములు
నూనె	16 గ్రాములు
పాలు	200 మి.లీ.
ఒక గుడ్డు	

పిల్లలకు..	
బియ్యం	75 గ్రాములు
కందిపప్పు	15 గ్రాములు
నూనె	5గ్రాములు
ఒక గుడ్డు	

ఇందులో ఏముంటాయంటే?

◆ 100 గ్రాముల రాగుల్లో 328 క్యాలరీల శక్తి ఉంటుంది. ఐరన్ 3.9 మిల్లీ గ్రాములు, సోడియం 11 మి.గ్రా, కాల్షియం 344 మి.గ్రా., పోటాషియం 408 మి.గ్రా. ఉంటాయి.

◆ పిల్లల ఎముకలు దృఢంగా మారడానికి కావాల్సిన కాల్షియం అందుతుంది.

◆ కాల్షియం, ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇనుము మోతాదు ఎక్కువగా ఉండటంతో రక్తహీనత తగ్గిస్తుంది.

◆ 'సీ' విటమిన్ వల్ల రోగనిరోధక శక్తిని పెరుగుతుంది. మాంసకృతులూ ఎక్కుగా ఉంటాయి.

◆ కండరాల ఆరోగ్యంతో పాటు రక్తం తయారు కావడానికి దోహదపడుతుంది.

నిజాంసాగర్ వరద గేట్ల మూసివేత


నిండుకుండలా జలాశయం

నిజాంసాగర్ : నిజాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గిపోవడంతో ప్రధాన వరద గేట్ల నుంచి నీటి విడుదల నిలిపివేసినట్లు జలవనరుల శాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. మంగళవారం సాయంత్రానికి సాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 4200 క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో వరద గేట్లను మూసివేశామన్నారు. జలవిద్యుదుత్పత్తి కేంద్రం నుంచి వానాకాలం పంటల సాగు కోసం 2000 క్యూసెక్కులు సాగర్ ప్రధాన కాలువలోకి విడుదల కొనసాగుతుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404.92 అడుగుల (17.687 టీఎంసీలు) నిల్వ ఉందని పేర్కొన్నారు.

రూ.10 లక్షల పింఛను డబ్బులు స్వాహా

బీబీపేట, న్యూస్‌టుడే: రూ.10 లక్షల పింఛను డబ్బులను స్వాహా చేసిన ఘటన బీబీపేట మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తుజాల్‌పూర్ గ్రామ తపాలా శాఖలో పనిచేసే బీపీఎం దేవిసోత్ భిక్య ఈ ఏడాది జూన్ 6న సస్పెండ్ అయ్యాడు. అతడి స్థానంలో ఇస్సానగర్ గ్రామ బీపీఎం బట్టు అనిల్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు. సెప్టెంబరు 30న బీపీఎం అనిల్ ఇస్సానగర్, తుజాల్‌పూర్ గ్రామాలకు సంబంధించిన చేయూత, ఆసరా పింఛన్ల రూ.10 లక్షల నగదును బీబీపేట పోస్టాఫీస్ నుంచి తీసుకుని వెళ్లాడు. అనిల్ ఈ డబ్బును సస్పెన్షన్‌లో ఉన్న దేవిసోత్ భిక్య గదిలో దాచాడు. మంగళవారం ఆ గదికి వద్దకు వెళ్లగా తాళం వేసి ఉంది. భిక్య, అతడి స్నేహితుడు వాకడోత్ సురేశ్‌ల ఫోన్లు స్విచ్ఛాఫ్ వచ్చాయి. వీరు ఇద్దరు కలిసి రూ.10 లక్షల ప్రభుత్వ పింఛన్ డబ్బులను తీసుకుని పారిపోయారని బీబీపేట ఎస్పీఎం బస్వయ్యల నర్సింలు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

డీఎస్సీలో వీరు ప్రత్యేకం

న్యూస్‌టుడే, డిచ్‌పల్లి, భిక్కనూరు

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన అన్నదమ్ములు, భార్యాభర్త మంచి ర్యాంకులు సాధించి ప్రత్యేకంగా నిలిచారు.

అన్నదమ్ములు అదుర్స్..

డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన ఏరా సుజాత-రాంచందర్ దంపతుల ఇద్దరు కుమారులు రణేందర్, రాకేశ్ సత్తాచాటారు. పెద్ద కుమారుడు రణేందర్‌కు 2022లో కోర్టులో ప్రాసెస్ సర్వర్ ఉద్యోగం వచ్చింది. అందులో చేరిన నెల రోజులకే ఆర్ఆర్‌బీలో గ్రూప్-2 ఉద్యోగం వరించింది. అయినప్పటికీ కోర్టు ఉద్యోగాన్నే కొనసాగిస్తున్నారు. సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో రణేందర్ ఎస్జీటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈయన తమ్ముడు రాకేశ్ వ్యాయామ విద్య (పీఈటీ, పీడీ) విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించడం గమనార్హం. ఇలా అన్నదమ్ములు ఇద్దరూ డీఎస్సీలో ప్రతిభ చాటడంతో వారి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు అభినందిస్తున్నారు.


అన్నదమ్ములు ఏరా రణేందర్, రాకేశ్


శ్యామ్‌రాజ్, అరుణ

ప్రత్యేక విద్యావిభాగంలో..

భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డికి చెందిన శ్యామ్‌రాజ్ ఎస్జీటీ ప్రత్యేక విద్యావిభాగంలో కామారెడ్డి జిల్లా 4వ ర్యాంకు సాధించగా.. ఆయన భార్య అరుణ ఎస్జీటీ ప్రత్యేక విద్యావిభాగంలో మెదక్ జిల్లాలో 5వ ర్యాంకు పొందడం విశేషం. ఒకే డీఎస్సీలో దంపతులిద్దరూ ప్రతిభ చాటడంతో స్నేహితులు, గ్రామస్థులు అభినందించారు.





సెలవు.. విద్యార్థి ముఖం వెలుగు

రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు ఈ నెల 14 వరకు దసరా సెలవులు ప్రకటించింది. నాలుగు నెలల తర్వాత వచ్చిన విరామం కావడంతో విద్యార్థుల సంతోషానికి అవదులు లేకుండా పోయాయి. ఎవరి ముఖం చూసినా వెలుగులు కనిపించాయి. జిల్లా కేంద్రంలో చదువుతున్న తమ పిల్లల్ని తీసుకెళ్లేందుకు తల్లిదండ్రుల రాకతో నిజామాబాద్ ప్రధాన బస్టాండు కిటకిటలాడింది. బస్సుల్లో సీట్లు దక్కించుకునేందుకు పోటీపడ్డారు. ఏ బస్సు చూసినా కిక్కిరిసి కనిపించింది.

- ఈనాడు, నిజామాబాద్



రాష్ట్రస్థాయి విజేతలకు సన్మానం

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సత్తాచాటిన యోగాభ్యాసకులను కామారెడ్డి జిల్లాకేంద్రంలోని యోగాభవన్‌లో మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లాకు చెందిన రాజ్‌కుమార్, లింగమూర్తి, అనిల్‌రెడ్డి, శ్రీనివాసులు రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పతకాలు సాధించారు. దీంతో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజేతలను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యోగా రాంరెడ్డి, కార్యదర్శి పెట్టిగాడి అంజయ్య, ఉపాధ్యక్షులు బాస రఘుకుమార్, అర్వపల్లి రమేశ్, వెంకటేశం, వేణు, శ్రీనివాస్, పోచయ్య, గంగాసాగర్ పాల్గొన్నారు.


పతకాలు సాధించిన యోగా సభ్యులను సన్మానిస్తున్న ప్రతినిధులు

బీడీ కార్మికులకు జీవనభృతి పెంచాలి

రామారెడ్డి, న్యూస్‌టుడే: బీడీ కార్మికులకు జీవనభృతి ప్రభుత్వం తక్షణమే పెంచాలని సీపీఐఎంఎల్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ అన్నారు. మంగళవారం రామారెడ్డిలో బీడీ కార్మికులు ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ సువర్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, కిశోర్, గోపాల్, వెంకన్న, నర్సవ్వ పాల్గొన్నారు.


తహసీల్దార్ సువర్ణకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీపీవో శ్రీనివాస్ రావు

జిల్లాస్థాయి పోటీలు ప్రారంభం

మాచారెడ్డి: సోమారంపేట ఉన్నత పాఠశాలలో 68వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా వచ్చిన డీపీవో శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకొని ప్రపంచ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని సూచించారు. జిల్లాలోని 8 జోన్ల నుంచి అండర్ 14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, ఎంపీడీవో గోపిబాబు, ఎంఈవో దేవేందర్ రావు, మాచారెడ్డి పాఠశాల హెచ్ఎం వెంకటచారి, లచ్చాపేట పాఠశాల హెచ్ఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఈటీలు సంధ్య, హీరాలాల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

సదాశివనగర్, న్యూస్‌టుడే: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇంఛార్జి ఈశ్వర్ అన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గ నాయకులతో కలిసి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బీఎస్పీ తరపున రైతుల సమస్యలపై పోరాటం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, సురేశ్, మండలాల అధ్యక్షులు సాయిలు, జీవన్, నవీన్, సిద్ధిరాములు, శ్యామ్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు


నటేశ్వరశర్మ, రాజేశ్వరశర్మ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న డా.వి శంకర్, ప్రతినిధులు సిరిగాధ శంకర్, చలపతి

సాహిత్యలోకానికి తీరని లోటు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: అనతికాలంలోనే కామారెడ్డి ప్రాంతానికి చెందిన నటేశ్వరశర్మ, రాజేశ్వరశర్మలను కోల్పోవడం సాహిత్యలోకానికి తీరని లోటని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి డా.వి శంకర్ అన్నారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలో మంగళవారం రాత్రి ఇటీవల మృతి చెందిన సాహితీవేత్తల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎందరో సాహితీప్రియులకు నటేశ్వరశర్మ స్ఫూర్తిదాయకమన్నారు. కవిత్వాన్ని లోతుగా విశ్లేషించిన సంగతి గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు సిరిగాధ శంకర్, చలపతి, ప్రకాశ్, అశోక్, రమేశ్, రాజశేఖర్, సత్యంరెడ్డి పాల్గొన్నారు.


రక్తదాతలతో సూపరింటెండెంట్ రాంసింగ్, ఇతర వైద్యాధికారులు

రక్తదాతలకు సన్మానం

కామారెడ్డి వైద్యవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా ఆసుపత్రిలో మంగళవారం రక్తదాతలను వైద్యాధికారులు సన్మానించారు. ఉత్తమ రక్తదాత పురస్కారాలను అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంసింగ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

లింగంపేట, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని రైతు వేదికలో ఏఈవోలు నల్లబ్యాడ్జీలతో మంగళవారం విధులకు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. డిజిటర్ సర్వేను క్లస్టర్‌లో ఒక ఏఈవో 5-8 గ్రామాలు, 6-10 వేల ఎకరాలు చేయడం కష్టమవుతోందన్నారు. గ్రామ స్థాయిలో సహాయకులను నియమించాలని విన్నవించినా పరిష్కారం చూపడం లేదన్నారు. ఏఈవోలు రాకేష్, సంతోష్, మధుసుదన్, అమీర్, నవ్య తదితరులు పాల్గొన్నారు

ఈనాడు సినిమాలు

ఏషియన్ ప్రియా సినీప్లెక్స్

దేవర 11.00 2.20 6.00 9.20

సత్యం సుందరం 11.00 2.20 6.00 9.20

వీ సినిమాస్

దేవర 10.50 2.15 5.50 9.30

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

బాన్సువాడ 83284 29129

కామారెడ్డి 93970 82242

●●● జిల్లాకేంద్రంలోని గొల్లవాడలో వ్యర్థాల సేకరణకు సిబ్బంది రావడం లేదు. చర్యలు తీసుకోవాలి.



రాములు, గొల్లవాడ

●●● సిబ్బందితో చర్యలు చేపడతాం.

-పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

●●● రెడ్డి కాలనీలో మురుగు కాలువ లేకపోవడంతో ఇబ్బందవుతోంది. **- బసిరెడ్డి, గొట్టిముక్కుల**

●●● మురుగు కాలువ ఆవశ్యకతను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. **- బాలకృష్ణ, గ్రామ ప్రత్యేకాధికారి, గొట్టిముక్కుల**

●●● రెడ్డిపేట్ నుంచి ఘన్‌పూర్‌కు వెళ్లే రోడ్డులో నీటి తొట్టె వృథాగా ఉంది. పంచాయతీ అధికారులు స్పందించి నీటి తొట్టెను వాడుకలోకి తీసుకురావాలి.

-రాజాగౌడ్, గ్రామస్థుడు

●●● నీటి తొట్టెకు మరమ్మతులు చేయిస్తాం. ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా పరిష్కరిస్తాను.

-నరేష్, పంచాయతీ కార్యదర్శి

●●● పిట్లం పోలీసు క్వార్టర్స్ సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్గంధం వస్తోంది. ఇబ్బందులు తప్పడం లేదు.

-రాము, స్థానికుడు

●●● చెత్తను తొలగించి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

-యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, పిట్లం

చెత్తను తొలగించిన అధికారులు

బిచ్కుంద, న్యూస్‌టుడే: బిచ్కుంద మండల కేంద్రలోని టీచర్స్ కాలనీలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని మంగళవారం 'మేమున్నాం.. మీకు తోడుగా..'లో రావడంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగించారు.

●●● బాన్సువాడ 9వ వార్డులో పలు చోట్ల మురుగు కాల్వలు చెత్తతో పేరుకు పోయాయి.



- శ్రీనివాస్, బాన్సువాడ

●●● ఈ విషయాన్ని పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సతీష్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సిబ్బందితో చెత్త నిల్వలు తొలగించి సమస్య పరిష్కరించారు.

– కామారెడ్డి పట్టణం, దోమకొండ, రామారెడ్డి, పిట్లం, బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే

రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలి

భిక్కనూరు, న్యూస్‌టుడే: రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని అంతంపల్లి సింగిల్ విండో ఛైర్మన్ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం అంతంపల్లిలో విండో మహాజన సభ నిర్వహించారు. రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.15 వేలు, సంఘంలో అప్పు ఉండి రెగ్యులర్‌గా ఉన్నవారికి డివిడెండ్ పంపిణీ చేయాలని తీర్మానించారు.

ర్యాలీకి తపస్ మద్దతు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన 317 ఉత్తర్వుల బాధితులతో బుధవారం చేపట్టే ర్యాలీకి మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

గ్రాడ్యుయేషన్ డే

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలో ఆర్కే డిగ్రీకళాశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యనందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఛైర్మన్ భాస్కర్‌రావు, ప్రిన్సిపల్ సైదయ్య, నవీన్, గోవర్ధన్‌రెడ్డి, గంగాధర్ తదితరులున్నారు.

'సోయి లేకుండా మాట్లాడుతున్నారు'

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: రుణమాఫీపై భారాస నాయకులు సోయిలేకుండా మాట్లాడుతున్నారని, అసలు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అధ్యక్షుడు కురమ సాయిబాబా మండిపడ్డారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నాయకులు వెంకట్రాంరెడ్డి, సామెల్, శ్రీనివాస్, విద్యాసాగర్, నాగరాజు, సల్మాన్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం

బీర్కూర్, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ బీర్కూర్ ఆధ్వర్యంలో మంగళవారం బీర్కూర్‌లోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 15 మందికి కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న ముగ్గురిని నిర్ధారించారు. వీరిని శస్త్రచికిత్స నిమిత్తం బోధన్ కంటి దవాఖానాకు సిఫార్సు చేసినట్లు వైద్యుడు సతీష్ తెలిపారు. క్లబ్ మండలాధ్యక్షుడు గాలయ్య, రమేష్, కిషోర్, విఠల్ ఉన్నారు.

అతివల ఆర్థిక ప్రగతికి చేయూత

బాన్సువాడ బల్దియాలో మహిళా శక్తి క్యాంటీన్

న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం



ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు ఆర్థికంగా దోహదపడుతూ.. వారి ఉన్నతికి కృషి చేసేలా రాష్ట్ర వ్యాప్తంగా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో మొదటిసారిగా బాన్సువాడ బల్దియాలో మహిళా శక్తి క్యాంటీన్ ఇటీవలే ప్రారంభమైంది. దీనిని సంఘం సభ్యులు నిర్వహిస్తున్న తీరుపై కథనం.

నిర్వహణ ఇలా..

సంఘం సభ్యులు నలుగురు కలిసి క్యాంటీన్ ప్రారంభించారు. వారికి వచ్చిన వివిధ రకాల పిండివంటలు చేసి విక్రయిస్తున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నారు. పచ్చళ్లు, చిరుతిళ్లు, తెలంగాణ ప్రత్యేక వంటకాలను ప్రజలకు అందుబాటులో ఉంచారు. ముందస్తుగా సమాచారం ఇస్తే ప్రజలకు నచ్చిన వంటలు సైతం చేసి పెడుతున్నారు.

నాణ్యమైన వంటకాలు అందిస్తాం

- సరిత, నిర్వాహకురాలు



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా ప్రజలకు నాణ్యమైన వంటకాలు అందించేలా కృషి చేస్తున్నాం. ప్రభుత్వం ఈ పథకం ద్వారా మాలాంటి వారికి చేయూతనివ్వడం ఆనందంగా ఉంది. పొలెలు, సకినాలు, మురుకులు, గరిజెలు లాంటి తెలంగాణ ప్రతి పిండి వంటకాలు, వివిధ రకాల పచ్చళ్లు అందుబాటులో ఉన్నాయి. నచ్చిన వాటిని ప్రజలు ఆర్డర్ చేస్తే తయారు చేసి అందిస్తాం.

మహిళల ఆర్థిక ప్రగతికి కృషి

- శ్రీధర్‌రెడ్డి, మెప్మా పీడీ



ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ అతివల ఆర్థిక ప్రగతికి మరింత చేయూతనిచ్చేలా కృషి చేస్తుంది. ప్రజలకు ఆహార వంటకాలు నాణ్యమైనవి అందించేలా మహిళా సంఘాల సభ్యుల ద్వారా చేయించి క్యాంటీన్‌లో విక్రయిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు బాన్సువాడలో మాత్రమే ప్రారంభమైంది. త్వరలోనే కామారెడ్డి, ఎల్లారెడ్డిలో సైతం ప్రారంభిస్తాం. ఆసక్తి ఉన్న సభ్యులు ముందుకు వస్తే వారికి సైతం అవకాశం కల్పిస్తాం.

సామాజిక సేవల్లో పాల్గొనాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొనాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. జిల్లాకేంద్రంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్ భవనంలో మంగళవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులను పిల్లలు బాగా చూసుకోవాలన్నారు. వృద్ధులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని పుర ఛైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో బావయ్య, సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు పున్న రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి రాజన్న తదితరులున్నారు.



ముఖ్యఅతిథి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ప్రతినిధులు

డీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

కామారెడ్డి సంక్షేమం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఆ పార్టీశ్రేణులు జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఆయనతో కేక్ కోయించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, నాయకులు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, గోనె శ్రీనివాస్, దేవరాజ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నంద రమేశ్, పాత శివకృష్ణమూర్తి, పంపరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కోస్తున్న కైలాస్ శ్రీనివాస్‌రావు

గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో..

బతుకమ్మ, బతుకమ్మ, ఉయ్యాలో.. గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో అంటూ మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఆట ఆడారు. జిల్వావ్యాప్తంగా మంగళవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. పలు బడుల్లో, కళాశాలల్లో కార్యక్రమాలు జరిగాయి. ఆటపాటలతో సందడి చేసి చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– న్యూస్‌టుడే బృందం



కామారెడ్డిలో ఆర్కిడ్స్ పాఠశాల ఆవరణలో..



జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



భిక్కనూరులో..



జీజీపేట టీఎస్ఎన్ఆర్ పాఠశాలలో..



పుల్కల్‌లో..



ఎల్లారెడ్డి: ఆదర్శ పాఠశాలలో..



సర్వాపూర్‌లో..



దోమకొండ మండల కేంద్రంలో చిన్నారులు



బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



బోర్లం ప్రాథమిక పాఠశాలలో



గిద్ద ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబురాలు



కోమలంచలో..



బాన్సువాడ సరస్వతి శిశు మందిర్‌లో..



లింగంపేట: బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు



పెద్దకొడప్‌గల్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో..



కొనా బాన్సువాడ ఉన్నత పాఠశాలలో...



బీర్కూర్ ఉన్నత పాఠశాలలో..

'రైతులది కాదు.. భారాసదే ధర్నా'

గాంధారి, న్యూస్‌టుడే: మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన మహా ధర్నా రైతులది కాదని మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఆధ్వర్యంలో భారాస నాయకులే చేపట్టారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తుర్పు రాజులు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌పై అవాకులు చెవాకులు పేల్చడం భారాస నాయకుడు సత్యం రావుకు తగదని గాంధారి మాజీ సర్పంచి మమ్మాయి సంజీవ్ హెచ్చరించారు. అనంతరం బాధితులకు సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు మోహన్‌నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కామెల్లి బాల్‌రాజ్, ఏఎంసీ, సొసైటీ ఛైర్మన్లు పరమేశ్, సాయికుమార్, వైస్ ఛైర్మన్ లక్ష్మణ్, నాయకులు రమేష్, బాబా, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుర్పు రాజులు, సమావేశంలో సొసైటీ, ఏఎంసీ ఛైర్మన్లు తదితరులు

మిఠాయిలో వెంట్రుకలు

☛ దుకాణదారుడితో యువకుల వాగ్వాదం

బీర్కూర్, న్యూస్‌టుడే: బీర్కూర్‌లోని ఓ మిఠాయి దుకాణంలో కొనుగోలు చేసిన మిఠాయిలో వెంట్రుకలు రావడంపై కొందరు యువకులు దుకాణదారుడితో మంగళవారం వాగ్వాదానికి దిగారు. బీర్కూర్‌కు చెందిన భాస్కర్ తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా దుకాణంలో మిఠాయిలు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లగా అందులో వెంట్రుకలు రావడంపై దుకాణదారుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: రోగులకు ఇబ్బందులు లేకుండా ప్రాంతీయా సుపత్రి నూతన భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక షెడ్డు నిర్మిస్తున్నట్లు బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్ పేర్కొన్నారు. మాతాశిశు ఆసుపత్రిలో కొనసాగుతున్న నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఎజాజ్, సురేష్, హకీమ్, బాబా, ఉదయ్, భాస్కర్ తదితరులున్నారు.

సంయుక్తంగా సర్వే చేపట్టాలి

గాంధారి, న్యూస్‌టుడే: గౌరారం పరిధిలో అన్యాక్రాంతం అవుతున్న 150 ఎకరాల అటవీ భూమిపై అటవీ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారుల సమక్షంలో జాయింట్ సర్వే చేపట్టి హద్దులు గుర్తించాలని గౌరారం గ్రామస్థులు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని అటవీ సంరక్షణాధికారి(పీసీసీఎఫ్) రాకేష్ మోహన్ డోబ్రియాల్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గాంధారి తహసీల్దార్ సతీష్‌రెడ్డి, డీటీ రవీందర్, గాంధారి, బాన్సువాడ ఎఫ్ఆర్వోలు హేమచందన, హబీబ్‌లు గౌరారంలో గ్రామస్థులతో చర్చించారు. అనంతరం అటవీ భూముల్లో సాగు చేసిన పంటలను పరిశీలించారు. అటవీ సిబ్బంది, గ్రామస్థులు శంకర్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



గౌరారంలో అటవీభూమికి పత్రాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ సతీష్ రెడ్డి, ఎఫ్ఆర్వోలు హేమచందన, హబీబ్, పక్కన డీటీ రవీందర్

రెడ్ల ఐక్యతకు కృషిచేయాలి

సదాశివనగర్, న్యూస్‌టుడే: రెడ్ల ఐక్యతకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని రెడ్డి సంఘం ప్రతినిధులు మంగళవారం తీర్మానం చేశారు. సదాశివనగర్ మండలం పద్మాజివాడికి చెందిన సంఘం ప్రతినిధులు రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి విద్యాపరిషత్ ట్రస్టులో రూ.5 వేలతో శాశ్వత సభ్యత్వం తీసుకోవడానికి నిశ్చయించారు. దీన్ని ఆదర్శంగా తీసుకొని అన్ని గ్రామాల ప్రతినిధులు ముందుకు రావాలని కోరారు.



పద్మాజివాడిలో సమావేశమైన రెడ్డి సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

జిల్లా అధికారికి సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ ప్రతినిధులు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను టీఎన్జీవోస్ ప్రతినిధులు మంగళవారం సన్మానించారు. బదిలీపై వెళ్తున్న రాజేశ్వర్‌కు వీడ్కోలు పలికారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కేంద్ర సంఘం కార్యదర్శి నాగరాజు, కోశాధికారి దేవరాజు, ఉపాధ్యక్షుడు పోచయ్య, లక్ష్మణ్, రాజేశ్వర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

భిక్కనూరు, న్యూస్‌టుడే: అండర్ 14 విభాగంలో భిక్కనూరు విజ్ఞాన్ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి మణిదీప్ క్రికెట్‌లో, చైతన్య పాఠశాల ఏడో తరగతి విద్యార్థి దండు అకుల్ ఆర్చరీలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు విజయభాస్కర్ రెడ్డి, రేణుకుమార్ తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఎల్లారెడ్డి గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని ఎం.సింధు బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి తెలిపారు. అండర్-17 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎం.చిరుత, ఎం.స్పందన ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

దోమకొండ కార్యదర్శిగా దయాకర్‌రెడ్డి

దోమకొండ: దోమకొండ గ్రామ కార్యదర్శిగా దయాకర్‌రెడ్డి మంగళవారం నియామకమయ్యారు. బస్వాపూర్ నుంచి డిప్యుటేషన్‌పై ఇక్కడికి వచ్చారు. కొత్తగా వచ్చిన కార్యదర్శికి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బంగారంకోసం వృద్ధురాలి హత్య

బిచ్కుంద, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గత నెల 29న మహిళను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బిచ్కుందకు చెందిన పండరి (22) నగలు దొంగిలించాలనే ఆలోచనతో గల్లీలోని కాశవ్వ(60) అనే వృద్ధురాలి ఇంటి వద్ద రెండు మూడు రోజులుగా రెక్కీ నిర్వహించాడు. ఎవరూ లేరని గమనించిన నిందితుడు ఇంట్లోకి చొరబడి రోకలి బండతో వృద్ధురాలి తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. మెడలో ఉన్న రెండు తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లాడు. నిందితుడు ఓ దాబా వద్ద ఉన్నాడన్న సమాచారం మేరకు ఎస్సై మోహన్‌రెడ్డి మంగళవారం పట్టుకున్నారు. నిందితుడి వద్ద రెండు తులాల బంగారం, హత్యకు ఉపయోగించిన రోకలిబండను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.



బిచ్కుంద: నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న నగలు

డ్రైవర్ నిర్లక్ష్యంతో ఒకరి మృతి

బీర్కూర్, న్యూస్‌టుడే: కల్లు తాగుతున్న వ్యక్తులపైకి వాహనం దూసుకెళ్లడంతో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన దామరంచలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం...దామరంచకు చెందిన చిన్నబాల్‌రాజ్ (53) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. దామరంచలోని ఓ దుకాణంలో కొంత మందితో కలిసి బాల్‌రాజ్ కల్లు తాగుతున్నారు. అదే సమయంలో నస్రుల్లాబాద్ మండలం దుర్కిలోని కల్లుడిపోనకు చెందిన వాహనం సీసాలు సరఫరా చేసేందుకు దామరంచకు వచ్చింది. మీర్జాపూర్‌కు చెందిన డ్రైవర్ సురేష్ అజాగ్రత్తగా వాహనాన్ని నడిపించడంతో బాల్‌రాజ్, గంగారాంలపైకి వాహనం దూసుకెళ్లింది. బాల్‌రాజ్‌కు తీవ్ర గాయాలు కావడంతో బాన్సువాడ నుంచి నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందారు. గంగారానికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మంగళవారం డ్రైవర్ సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

లింగంపేట: భవానిపేట గ్రామంలోని కత్తురి కిషన్ తన గేదెను మంగళవారం మేతకు తీసుకెళ్లారు. శివారులోని బాయికాడి బాలయ్య బోరుబావి వద్ద వ్యవసాయ భూమిలో సర్వీసు తీగ పడి ఉంది. దీనికి గేదె తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందిందని యజమాని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పెద్దకొడప్‌గల్: ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల పరిధిలోని బేగంపూర్ చౌరస్తా 161వ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న మల్కాపూర్ శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, ఇంటిలో అద్దెకు ఉంటున్న వ్యక్తి తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి తాళం వేసి తినడానికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి, వస్తువులు ధ్వంసం చేసి సీసీ కెమెరాలు ఎత్తుకెళ్లినట్లు వివరించారు.

వ్యక్తి అదృశ్యం

నాగిరెడ్డిపేట్: తాండూరు గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుందని ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లే పద్మారావు(47) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత బుధవారం రాత్రి 7 గంటల సమయంలో హైదరాబాద్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. హైదరాబాద్ వచ్చి అతడి భార్య చూడగా.. ఇంటి వద్ద లేరని, భర్త ఆచూకీ కోసం చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఎక్కడా లభించలేదని గోపాల్‌పేట్ ఠాణాలో భార్య నీలమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పద్మారావు

తల్లిని చంపిన కుమారుడికి మూడేళ్ల జైలు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: తల్లిని చంపిన కుమారుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా అదనపు జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్ మంగళవారం తీర్పు వెలువరిచారు. కేసుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దకొడప్‌గల్‌కి చెందిన వడ్డె నర్సింలు మద్యానికి బానిసై తల్లి నాగవ్వ(48)తో తరచూ గొడవ పడేవాడు. మూడేళ్ల క్రితం తల్లిని అతడు కర్రతో దాడి చేయగా చనిపోయింది. ఇంటి సమీపంలోని అనిల్ ఇచ్చిన ఫిర్యాదుతో ఠాణాలో కేసు నమోదైంది. సమగ్ర విచారణ జరిపిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష ఖరారు చేసింది. కేసు విచారణలో తోడ్పాటునందించిన అప్పటి బిచ్కుంద సీఐ చంద్రశేఖర్, ఎస్సై విజయ్, ప్రస్తుత బిచ్కుంద సీఐ నరేశ్, ఎస్సై మహేందర్, లైజనింగ్ అధికారి మురళి, సీడీవో మురళీకృష్ణ, విక్రంరెడ్డిని ఎస్పీ సింధూశర్మ అభినందించారు.